క్లుప్తంగా

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ శిబిరంలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా అన్నారు. అమలాపురంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఏఎస్పీ బాషా ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ మనిషి శరీరంలో 72 వేల నాడులను యోగా ఆరోగ్యంగా ఉంచుతుందన్నారు. ఒత్తిడి వల్ల ఉత్పన్నమయ్యే అనేక మానసిక సమస్యలు, రుగ్మతలను యోగా నివారిస్తుందన్నారు. బీపీ, షుగర్, గుండె, గ్యాస్ట్రిక్, కీళ్ల నొప్పులు తదితర అనేక రోగాలు దరి చేరకుండా యోగా రక్షణ కవచంగా నిలుస్తుందని చెప్పారు. శిబిరంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాల కల్పనకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగుల కోసం ర్యాంప్ నిర్మాణం తదితర సౌకర్యాలుండేలా చూడాలన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఇంటి పన్ను వసూళ్లు, ఆధార్ ప్రత్యేక శిబిరాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, దుర్గా శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్, చిక్కం శ్రీను, శ్రీరామచంద్రమూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

షోడశ సంస్కారాల్లో విశిష్టమైనది పుంసవన



సీమంతం నిర్వహిస్తున్న అక్షయ పాత్ర మహిళా ప్రతినిధులు

అమలాపురం టౌన్: షోడశ సంస్కారాల్లో విశిష్టమైనది పుంసవన సంస్కారమని శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగకనకదుర్గ అన్నారు. స్థానిక ఆదిశేష నిలయంలో శుక్రవారం జరిగిన పుంసవన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లికి సౌభాగ్యాన్ని, గర్భస్థ శిశువుకు ఉత్తమ లక్షణాలను, దీర్ఘాయుష్షును కోరుతూ గర్భం ధరించిన మొదలు మూడో మాసంలో మొదటి పది రోజుల్లో జరుపుకునేదే పుంసవన(సీమంతం) సంస్కారమని కనకదుర్గ వివరించారు. కార్యక్రమంలో భాగంగా సూర్యసాయి లక్ష్మీశ్రీదుర్గకు సీమంతం నిర్వహించారు.

అమరేశ్వరరావు, నల్లాలకు సత్కారం



అమరేశ్వరరావు, నరసింహమూర్తిలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: భీమనపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భవిష్య నిధి విశ్రాంత కమిషనర్, విశ్వనాథ్ స్మారక సన్మాన గ్రహీత అద్దంకి అమరేశ్వరరావు, తెలుగు అధ్యాపకుడు నల్లా నరసింహమూర్తిలను ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమరేశ్వరరావు మాట్లాడుతూ విశ్వనాథ్ స్మారక పురస్కారం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం మాతృభాషపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూకల సత్యనారాయణ, పీఈటీ కామన మధు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, స్వామినాయుడు, వెంకటేశ్వరరావు, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత



ఇంజరంలో ఉన్న చేనేత సహకార సంఘ భవనం



ఇంజరంలో మగ్గంపై చీరలను నేస్తున్న చేనేత కుటుంబం

- ప్రభుత్వ ప్రోత్సాహంతో చేనేతల జీవితాల్లో వెలుగులు
- నేతన్న నేస్తం ద్వారా ఒక్కొక్కరికీ రూ.1 లక్ష మేర లబ్ధి
- చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్

తాళ్లరేవు: గత టీడీపీ హయాంలో తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్న చేనేత పరిశ్రమకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనందిస్తుంది. రెడీమేడ్ దుస్తుల రాక తరువాత దాదాపుగా కనుమరుగయ్యే స్థితికి చేరుకున్న చేనేత రంగానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తూ కొత్త ఊపిరిలూదింది. గతంలో చేనేతకు దూరమైన కార్మికులు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని చూసి తిరిగి పరిశ్రమ వైపు వస్తున్నారంటే వారికి చేస్తున్న మేలును అర్థం చేసుకోవొచ్చు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో సత్ఫలితాలు

తాళ్లరేవు మండల పరిధిలోని ఇంజరం, జార్జిపేట, నీలపల్లి తదితర పంచాయతీల్లో వందలాది మంది చేనేత కార్మికులు గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్ర నష్టాల పాలై చేనేత పరిశ్రమకు దూరమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చేనేతకు పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో వారంతా తిరిగి నేత పని చేపట్టారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ సౌకర్యం కల్పించింది. దీంతో వందలాది కుటుంబాలకు మేలు జరుగుతోంది. అదే విధంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తుంది. దీంట్లో భాగంగా ఒక్కొక్క చేనేత కార్మికునికి గడిచిన నాలుగేళ్లలో సుమారు రూ.లక్ష మేర లబ్ధి చేకూరింది. ఒక్క ఇంజరం పంచాయతీ పరిధిలోనే సుమారు 100 మంది చేనేతలకు ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున ఏడాదికి రూ.24 లక్షలు, నాలుగేళ్లలో సుమారు రూ.కోటి మేర అందించినట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాల సభ్యులకు ఆప్కో ద్వారా ఉన్న బకాయిలను సైతం ప్రభుత్వం దఫదఫాలుగా విడుదల చేస్తుంది. చేనేత కార్మికులు తయారు చేసిన చీరలు, ధోవతీలు, దుప్పట్లు, టవళ్లు, లుంగీలు, పంచెలు, చేతిరుమాళ్లు తదితర డ్రెస్ మెటీరియల్స్‌కు రిబేటు ఇచ్చి కొనుగోలు శక్తిని పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలిస్తుండడంతో చేనేత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

చేనేతలకు నూతన శకం



టీడీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా నష్టాల బారిన పడి చాలామంది కార్మికులు పరిశ్రమకు దూరమయ్యారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేతలకు నూతన శకం ఆరంభమైంది. ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న హస్తం, వస్త్రాలకు రిబేటు వంటి సౌకర్యాలు కల్పించడంతో తిరిగి కార్మికులు పరిశ్రమ వైపు చూస్తున్నారు.

– ముద్దన వెంకట శివరామ ప్రసాద్, సర్పంచ్, ఇంజరం గ్రామ పంచాయతీ

పూర్వ వైభవం తెచ్చారు



జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాక తరువాత మా చేనేత కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరింది. వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమం ద్వారా నగదు వేయడంతో పాటు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తున్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన నూలు వస్త్రాలపై సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలను వైఎస్సార్ సీపీ హయాంలో పునరుద్ధరించి చేనేతకు పూర్వ వైభవం తెచ్చారు.

– జిట్ల ప్రసాద్, చేనేత కార్మికుడు

జేవీఎల్‌కు డాక్టరేట్



ముమ్మిడివరం: ఎల్గా చైర్మన్ జేవీఎల్ నరసింహారావుకు హర్యానాలోని ఫరిదాబాద్‌కు చెందిన 'మేజిక్ అండ్ ఆర్ట్స్' విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. గత 30 ఏళ్లుగా ఆంగ్ల బోధన, శిక్షణ, వ్యాసరచన, సామాజిక రంగాల్లో అందించిన సేవలకుగాను డాక్టరేట్ ఇచ్చినట్లు జేవీఎల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, డీఈఓ కె.కమలకుమారి, జగతా పద్మనాభం, జగతా జానకిరామయ్య, ఎల్గా సభ్యులు అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.63.75 లక్షల మంజూరు



లక్ష్మణేశ్వరంలోని పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామివారి ఆలయం

అల్లవరం: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రమైన పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.63.75 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీ చింతా అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను గత నెలలో తాడేపల్లిగూడెంలో కలిసి లక్ష్మణేశ్వరం ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. దీంతో నిధులు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఈ నిధులతో ఆలయ ముఖద్వారం, ముఖ మండపం, ధ్వజ స్తంభం, ప్రదక్షిణ మార్గం నిర్మిస్తామని, త్వరలోనే ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కొట్టు సత్యనారాయణలకు ఎంపీ అనురాధ కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- వివిధ అభివృద్ధి పనుల ప్రారంభం



బండారులంక హైస్కూల్‌లో నాడు-నేడు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మనబడి నాడు-నేడు ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన బండారులంకలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత వేదాంత సంస్థ మంజూరుచేసిన రూ.38 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని, నాడు-నేడు మొదటి దశలో బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.44.87 లక్షల వ్యయంతో ఆధునీకరించిన వసతులను, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం-2ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల తలరాతలు మార్చగలిగే శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని, అందుకే ప్రభుత్వం విద్యా వ్యాప్తికి అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. నాడు-నేడు, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న విదేశీ విద్యాదీవెన తదితర పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా వసతులను కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ఎనిమిదో తరగతి నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేలా బైజూస్ కంటెంట్‌తో కూడి ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తోందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందడంలో ఆంగ్ల భాషకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ఆంగ్లం మాధ్యమంలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీర్ పీఎస్ రాజ్‌కుమార్, వైస్ ఏఎంసీ చైర్‌పర్సన్ బడుగు మేరీకుమారి, సర్పంచ్ పెనుమాల సునీత, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలేపు నాగశ్రీనివాస్, జిల్లా చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జాన్ గణేష్, పీఎంసీ చైర్మన్ పెదపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమభారతి, గుత్తుల జానకి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కామనగరువులో..

మండలంలోని కరక్కాయపేటలో రూ.30 లక్షల ఖర్చుతో నిర్మించిన సీసీ డ్రెన్, అప్పనపేటలో రూ.47 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు, నల్లా గార్డెన్‌లో సీఎస్ఆర్ నిధులతో రూ.40 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, సర్పంచ్ నక్కా అరుణకుమారి, డాక్టర్ శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యులు గుత్తుల అనిత, మెండు గంగా భవానీ, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత సురేశ్వర స్వామివారు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కూనవరం గ్రామంలో పార్వతీ సమేత సురేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష బిల్వార్చన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు భైరవభట్ల గౌరీశంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష బిల్వాలతో పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అధికారులు సహకరిస్తే పట్టాలు అందిస్తాం



విలసవిల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: అధికారులు సహకరిస్తే రీసర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూమిని గ్రామస్తులకు ఇళ్ల పట్టాలుగా అందిస్తామని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తమ గ్రామానికి చెందిన 99 మంది లబ్ధిదారులకు స్థానికంగా స్థలం లేదంటూ కిత్తనచెరువులో ఇళ్ల పట్టాలు అందించారన్నారు. అయితే అంతదూరం వెళ్లలేమంటూ లబ్ధిదారులు తిరస్కరించారని చెప్పారు. ఇటీవల జరిగిన జగనన్న భూసర్వేలో గ్రామంలో అధిక శాతం ప్రభుత్వ భూమి కొందరి ఆక్రమణలో ఉందని తేలిందన్నారు. సర్వే నెంబర్ 109లో 94 సెంట్లు, 110లో 64 సెంట్లు, 116లో 99 సెంట్లు, 168/2లో 58 సెంట్ల భూమి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు అనువుగా ఉన్నాయన్నారు. వీటితో పాటు 1992లో శివాలయం కాలనీలో 135 మందికి పట్టాలు అందించినా అపోహలతో వాటిలో కొన్ని ఖాళీగా ఉంచేశారన్నారు. ప్రస్తుతం వాటిని ఇళ్ల స్థలాలుగా అందిస్తే గ్రామస్తులు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఎన్.అహ్మద్ ఆలీషా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సాల ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగం



రవాణా శాఖ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమని, రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం మంత్రి నివాసంలో రవాణా శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.రఘుబాబు ఆధ్వర్యంలో సంఘ నాయకులు మంత్రి పినిపే విశ్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర-2024 డైరీని మంత్రి విశ్వరూప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రవాణా శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు కొత్త పోస్టులను కూడా మంజూరు చేశామన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించమని చెప్పారు. శాఖ అభివృద్ధితో పాటు ఉద్యోగుల శ్రేయస్సు కూడా తమకు ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.రఘుబాబు, జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాప్, డైరీ కమిటీ చైర్మన్ వి.భరత్‌కుమార్, ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం.రాజుబాబు, కార్యదర్శి కేవీవీ నాగమురళి, ఉపాధ్యక్షుడు కె.రామ్మూర్తి, వి.నాగశంకర్, కోశాధికారి పి.దుర్గాప్రసాద్, పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ సుధాకర్

యానాం: యానాం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా వాలీబాల్, కోకో, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడల్లో విద్యార్థినీవిద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన అధికారి తిర్రి గోపి, ఇన్‌స్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిప్‌మెర్ ప్రారంభానికి మంత్రి జయకుమార్ రాక



ప్రారంభ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ఈ నెల 25న ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్ పద్ధతిలో జాతికి అంకితం చేయనున్న జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి పుదుచ్చేరి వ్యవసాయశాఖ మంత్రి జయకుమార్ హాజరుకానున్నారని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రారంభ నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి జిప్‌మెర్ ప్రధాన సూపరింటెండెంట్ దొరై రాజనన్, దిలీప్‌మౌర్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రాజ్, జీజీహెచ్ డీడీ రవిశంకర్, సీఐ షణ్ముగం పాల్గొన్నారు.

గోదావరి మాతకు పున్నమి హారతి



జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో అఖండ గౌతమీ గోదావరి తీరంలో గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంకాలం ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనార్దన భజన మండలి సభ్యుల బృందం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్రనామాలు, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ పఠించారు. అనంతరం స్థానిక శివాలయానికి విచ్చేసి జ్వాలాతోరణంలో పాల్గొన్నారు.

అధికారులు పౌర్ణమి స్నానాలు ఏర్పాట్లు పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు శనివారం మాఘపౌర్ణమి సందర్భంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను పోలీసు, దేవస్థానం అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, స్థానిక ఎస్సై ఎస్.రాము పరిశీలించారు. ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజలు, స్వామిని సముద్రం స్నానానికి తీసుకువెళ్లే క్రమంలో తగిన భద్రత గురించి వారు సమీక్షించారు. అలాగే ఒడ్డున భక్తులకు గతంలో మాదిరిగా జల్లు స్నానం ఏర్పాట్లను కూడా వారు పరిశీలించారు. వీటితో పాటు సముద్రంలో స్వామివారితో పాటు స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా భక్తుల భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలను, భక్తులు లోతు జలాల్లోకి వెళ్లనీయకుండా సముద్రంలో ఏర్పాటు చేసిన సర్వేబాదుల బారికేడ్లను వారు పరిశీలించారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ బైరా నాగరాజు, యేసుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదలతో ఇబ్బందులు

యానాం: నియోజకవర్గ పరిధిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లకు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పనులు స్తంభించిపోయాయి. పదే పదే విద్యుత్ కోతల కారణంగా తమ ఉపాధిని కోల్పోతున్నామని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలలో ఇప్పటికే 7, 14, 23 తేదీల్లో పూర్తిగా విద్యుత్‌ను నిలిపేశారని ఇలాగైతే ఎలా బతకాలని ప్రశ్నించారు. మాధవపట్నం సమీపంలో విద్యుత్ లైను మరమ్మత్తు పనులను విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు శుక్రవారం పర్యవేక్షించారు.

బీచ్‌లో జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు



అంతర్వేది బీచ్‌లో జల్లు స్నానానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో పౌర్ణమి స్నానాలు పురస్కరించుకుని ఒడ్డున భక్తుల కోసం దేవస్థానం జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు శుక్రవారం పూర్తి చేసింది. శనివారం సముద్రంలో సుదర్శన చక్రధారుడైన స్వామివారితో పాటు స్నానం చేయలేని భక్తులకు జల్లు స్నానం ద్వారా స్వామి కరుణ, కటాక్షాలు కలుగజేసేందుకు ఈ ఏర్పాట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చేశారు. ఇందుకు ఒడ్డున సర్వే బాదులతో ప్రత్యేక లైను ఏర్పాటు చేసి, మధ్యలో అరప కట్టారు. అరపపై సుదర్శన చక్రధారుడైన లక్ష్మీ నృసింహుని విగ్రహాన్ని ఆశీనులు చేసి, విగ్రహంపై నుంచి ప్రత్యేక పైపు మార్గం ద్వారా సముద్ర జలాలు జారవిడుస్తారు. అరప కింద భాగంలో క్యూ లైన్‌లో భక్తులు వెళ్లే క్రమంలో అరప పై నుంచి స్వామి విగ్రహం మీదుగా జారవిడిచే జలాలు భక్తుల శిరస్సులపై పడతాయి. కాగా చివరి సారిగా ఈ ఏర్పాట్లు 2019 ఉత్సవాల్లో చేశారు. నాలుగేళ్ల విరామం అనంతరం ఈ ఏడాది జల్లు స్నానంకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తీసుకున్న చొరవతో పునరుద్ధరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.

లివర్, కిడ్నీ బాధిత పాపకు ఆర్థిక సాయం



పాప తల్లికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పి.మీనాక్షి(3)కి లివర్, కిడ్నీ ఫెయిల్యూర్ కావడంతో తిన్నది జీర్ణం కాక రక్త వాంతులు అవుతున్నాయి. పాప ఆపరేషన్‌కి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పాపకు తండ్రి లేకపోవడంతో తల్లి మాత్రమే కుటుంబాన్ని పోషిస్తుంది. పాప వైద్యం నిమిత్తం సాయం చేయమని అక్షయ సేవా సంస్థ సభ్యులను కోరడంతో రూ.12 వేల నగదును సంస్థ సభ్యులు శుక్రవారం అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

అంబాజీపేట: ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట మండల రీసోర్స్ భవనం వద్ద విద్యా హక్కు చట్టం పాంప్లెట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అమలయ్యే ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉందన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ ట్రైబ్స్‌కు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన మైనార్టీ, ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏడాదికి రూ.1.20 లక్షలు లోబడి ఉన్న వారికి 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఐదేళ్లు నిండి అర్హులైన వారు ప్రస్తుత చిరునామా, ఆధార్, ఓటరు, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 14వ తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.